



నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
మెదక్
సంగారెడ్డి
సిద్దిపేట
గురువారం 12 ఫిబ్రవరి 2026

## ప్రశాంతంగా ముగిసిన...
# మున్సిపల్ పోలింగ్

- అందోల్-జోగిపేటలో సందడి..
- పోలింగ్ స్టేషన్-13 వద్ద ఓటేసిన ఆరోగ్య శాఖ మంత్రి..
- 9వ వార్డులో ఓటు వేసిన దామోదర్ రాజనర్సింహ.
- ప్రజలకు ఓటు పిలుపు.
- ఉదయం నుంచే ఓటర్ల క్యూలు.
- వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మంత్రి ఓటు.
- ఓటు పవిత్ర హక్కు ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి: దామోదర్ రాజనర్సింహ




**సంగారెడ్డి మేజర్ న్యూస్ ప్రతినిధి....**
అందోల్‌జోగిపేట మున్సిపాలిటీలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికలు ఉత్సాహభరితంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా రాష్ట్ర వైద్య,


మిగతా 2 లో..

## మంటలతో రగిలిన స్క్రాప్ నిలువ గోదాం....

భారీ మంటలతో దగ్ధమైన స్క్రాప్ గోదాం...


2 లో..

## సంగారెడ్డి మున్సిపల్ లోని 34వ వార్డులో తీవ్ర ఉద్రిక్తత

### పోలీసులపై జగ్గారెడ్డి విశ్వరూపం



**సంగారెడ్డి సూర్య మేజర్ న్యూస్**
సంగారెడ్డిలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా 34వ వార్డులో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. బోగస్ ఓట్లు వేస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ అభ్యర్థి అడ్డూ ఈ

మిగతా 2 లో..

# ప్రభుత్వ అసైన్డ్ భూములు, కాలువలు కబ్జా

### నిబంధనలు పక్కన పెట్టి ప్లాట్ల విక్రయాలు
### అధికారుల నిర్లక్ష్యంపై రైతుల ఆవేదన



**కొండాపూర్ మేజర్ న్యూస్**
సంగారెడ్డి జిల్లాకు ఆనుకొని ఉన్న కొండాపూర్ మండల పరిధిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం అతివేగంగా విస్తరిస్తోంది. వ్యవసాయ భూములను భారీ స్థాయిలో కొనుగోలు చేస్తున్న రియల్టర్లు వాటిని ప్లాట్లుగా మార్చి విక్రయాలు సాగిస్తున్నారు. అయితే, ఈ ప్రక్రియలో ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**పూర్తి అనుమతులు లేకుండానే విక్రయాలు?**
. ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఫీజులు, అభివృద్ధి చార్జీలు కట్టాల్సి ఉంటుంది. అదేవిధంగా వెంచర్ పరిధిలో 10 శాతం భూమిని గ్రామపంచాయతీ పేరిట రిజిస్ట్రేషన్

మిగతా 8 లో..

## ఓటింగ్ సరళిని పరిశీలించిన ఎన్నికల అధికారి కలెక్టర్

**చేర్యాల మేజర్ న్యూస్ ...**


2 లో..

### మున్సిపల్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న
# జిల్లా కలెక్టర్ దంపతులు

**మెదక్ మేజర్ న్యూస్ ప్రతినిధి....**
మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌లో భాగంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని


మిగతా 2 లో..

## మున్సిపాలిటీలలో శత శాతం
# ఓటింగ్ జరగాలి



బాధ్యతగా మున్సిపల్ పరిధిలో ఉన్న ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. బుధవారం రామాయంపేట

మిగతా 2 లో..

## సూర్య కథనానికి స్పందన


2 లో..

## ప్రశాంతంగా ముగిసిన...
# మున్సిపల్ పోలింగ్

(మొదటి పేజీ తరువాయి..)

ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శ్రీ బుధవారం తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్-13కు చేరుకున్న మంత్రి ఎన్నికల సిబ్బందిని అభివాదం చేసి ఓటు వేశారు.మంత్రి రాకతో పోలింగ్ కేంద్రం వద్ద కాసేపు సందడి నెలకొంది. స్థానిక ప్రజలు, పార్టీ నాయకులు ఆయనను ఆత్మీయంగా పలకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి ఓటరు తప్పనిసరిగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికలు ప్రజల అభిప్రాయాన్ని ప్రతిబింబించే ప్రక్రియ అని, భవిష్యత్తు పాలనకు బాటలు వేసేది ఓటేనని ఆయన పేర్కొన్నారు.ఎన్నికల నిర్వహణపై అధికారులు తీసుకున్న చర్యలను మంత్రి అభినందించారు. పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడం, ఓటర్లకు సౌకర్యాలు కల్పించడం మంచి విషయమన్నారు. మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొనడం ప్రజాస్వామ్య చైతన్యానికి నిదర్శనమని తెలిపారు.పోలింగ్ కేంద్రం వద్ద ఉదయం నుంచే ఓటర్లు క్యూలలో నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో ఎన్నికలు శాంతియుతంగా కొనసాగుతున్నాయి.మంత్రి ఓటు హక్కు వినియోగంతో ప్రాంతంలో ఎన్నికల ఉత్సాహం మరింత పెరిగింది. స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పోలింగ్‌లో పాల్గొని ప్రజాస్వామ్య పండుగను విజయవంతం చేయాలని ఆయన మరోసారి కోరారు.

# మంటలతో రగిలిన స్క్రాప్ నిలువ గోదాం....



**పటాన్ చేరు మేజర్ న్యూస్**

సంగారెడ్డి జిల్లా పటాన్ చేరు మండల పరిధిలోని ఇంద్రేశం రహదారీ పక్కన ఉన్న స్క్రాప్ గోదాములో బుధవారం అగ్ని ప్రమాదం సంభవించింది. స్థానికుల సమాచారం అందుకున్న వెంటనే ఘటనసలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది. ఎగిసిపడుతున్న మంటలను అదుపులోకి తెచ్చారు. స్క్రాప్ గోదాంలో అకస్మాత్తుగా చెలరేగిన అగ్ని, ఎగిసిపడిన మంటలతో పరిసరాల్లో ఉన్న ప్రజలు భయందోళనకు గురయ్యారు. గోదాం లో పరిశ్రమల నుండి తెచ్చిన రసాయన కెమికల్స్ నిలువ ఉండడం వల్ల ఈ ప్రమాదం సంభవించిందని స్థానికులు తెలిపారు. నిత్యం రోడ్లపై స్క్రాప్ గోదాములు విచ్చలవిడిగా ఏర్పాటు చేయడంతో ప్రజలకు అసౌకర్యం ఎదురవుతుంది. తరచూ అగ్ని ప్రమాదాల భయం వెంటాడుతుంది. దుమ్ము దుర్వాసనలతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి అని వాపోతున్నారు. రాత్రి వేళల్లో ట్రక్కుల రాకపోకలతో కాలుష్య డ్రమ్ములు నిల్వ ఉన్న పదార్థాలను తగలబెట్టడంతో పిల్లలు వృద్ధులకు శ్వాసకోశ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంటుందని కాలనీ ప్రజలు తెలిపారు. ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన చర్యలు లేకపోవడంతో విచ్చలవిడిగా స్క్రాప్ గోదాములు పుట్టుకొస్తున్నాయని కాలనీకి చెందిన ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా స్క్రాప్ గోదాములపై పొల్యూషన్ మరియు ఫైర్ సేఫ్టీ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుకుంటున్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న
# జిల్లా కలెక్టర్ దంపతులు




(మొదటి పేజీ తరువాయి..)

మున్సిపాలిటీ గాంధీనగర్ వార్డ్ నెంబర్ -18 పోలింగ్ స్టేషన్ నెంబర్ 35 వద్ద కలెక్టర్ దంపతులు సామాన్య ఓటరుల్లా వరుసలో నిలబడి ఓటు వేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైనదని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఓటరు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఓటరు పోలింగ్ కేంద్రానికి చేరుకుని నిర్భయంగా ఓటు వేయాలని, స్థానిక స్వపరిపాలనలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి మున్సిపల్ లోని 34వ వార్డులో తీవ్ర ఉద్రిక్తత

(మొదటి పేజీ తరువాయి..)

విషయాన్ని పట్టించు కోక కాంగ్రెస్ అభ్యర్థిని గల్లా పట్టి నెట్టివేయగా.. విషయం తెలిసి పోలింగ్ కేంద్రానికి చేరుకున్న జగ్గారెడ్డి సీఐ నీ తీవ్ర పదజాలంతో దూషిస్తూ దాడికి యత్నించగా అడ్డుకున్న డీఎస్పీ, పోలీసులు దొంగ ఓట్లతో గెలవాలనే ప్రయత్నం చేశారని .. పోలింగ్ రద్దు చేయనిదే ఇక్కడి నుండి కదిలేది లేదన్న జగ్గారెడ్డి అన్నారు.అడిషనల్ ఎస్పీ వచ్చి సిఐపై చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడంతో జగ్గారెడ్డి శాంతించారు.

# ఓటింగ్ సరళిని పరిశీలించిన ఎన్నికల అధికారి కలెక్టర్

(మొదటి పేజీ తరువాయి..)

చేర్యాల:జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కె. హైమావతి చేర్యాల మున్సిపాలిటీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెద్దమ్మగడ్డ, పాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ జూనియర్ కళాశాల,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(కో ఎడ్యుకేషన్) లోని పోలింగ్ స్టేషన్లలో ఓటింగ్ సరళిని బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు.పోలింగ్ కేంద్రాల్లో 100 మీటర్ల పరిధిలో వాహనాలు, మొబైల్ ఫోన్‌లను అనుమతించకూడదని, వృద్ధులు, వికలాంగులకు వీల్‌చైర్ ద్వారా లోపలికి తీసుకురావాలని పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.144 సెక్షన్‌ను కఠినంగా అమలు చేసి గట్టి బందోబస్తు నిర్వహించాలని పేర్కొన్నారు. కలెక్టర్ వెంట ఏసిపి వెంకట్రావు, మున్సిపల్ కమిషనర్ నాగేందర్, తహసీల్దార్ దిలీప్ కుమార్ తదితరులు ఉన్నారు.

# సూర్య కథనానికి స్పందన

**కుకునూరుపల్లి/మేజర్ న్యూస్..**

మండల కేంద్రంలోని సోమవారం నాడు నిర్లక్ష్యానికి నిదర్శనం పల్లె ప్రకృతి వనం పైనా ప్రచురించిన నేటి దినపత్రిక సూర్య కథనానికి స్పందించిన గ్రామ సర్పంచ్ మల్లం కనుకవ్వ ఐలయ్య సెక్రెటరీ సప్నారెడ్డి, బుధవారం పారిశుధ్య కార్మికులు ముమ్మరంగా పనులు చేపట్టారు.మద్యం సీసాలు వాటర్ బాటిల్లు పిచ్చి మొక్కలను పూర్తిగా తొలగించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పార్కులో మద్యం సేవించిన అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారం రోజుల్లో పార్కును వినియోగంలోకి తీసుకొస్తాం గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

# మున్సిపాలిటీలలో శత శాతం ఓటింగ్ జరగాలి

(మొదటి పేజీ తరువాయి..)

మున్సిపాలిటీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ.. శత శాతం ఓటింగ్ జరగాలని సెలవు రోజు కాలక్షేపం చేయకుండా బాధ్యతగా ఓటు వేయాలన్నారు. భారత ప్రజాస్వామ్య దేశంలో రాజ్యాంగం కల్పించిన ఓటు అందరికీ సమానం ఉంటుందన్నారు. దేశ రాష్ట్రపతి కైనా సామాన్య వ్యక్తికైనా సమానమైన ఓటు హక్కును భారత రాజ్యాంగం కల్పించిందని స్పష్టం చేశారు. ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా అర్బన్ ఓటర్ నిజాయితీగా, నిక్కచ్చిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. జిల్లాలోని నాలు మున్సిపాలిటీ పరిధిలో 148 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 9:00 వరకు 10 శాతం ఓటింగ్ నమోదయిందని, ఓటింగ్ ప్రశాంతంగా నడుస్తుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 1408 పోలింగ్ కేంద్రాలలో సీసీటీవీ కెమెరాలు వెబ్ కాస్టింగ్ ద్వారా కలెక్టరేట్ కార్యాలయం పోలీస్ హెడ్ క్వార్టర్ నుండి పర్యవేక్షణ చేస్తున్నట్లు వివరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతిభద్రతలకు విఘాగం కలవకుండా పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లకు త్రాగునీరు, మరుగుదొడ్లు ,టెంట్లు షామియానా ,కుర్చీలు వృద్ధులకు వీల్ చైర్లు పొడి చేసినట్లు తెలిపారు.మెదక్ జిల్లాలోని మెదక్, రామాయంపేట, తూప్రాన్ , నర్సాపూర్ మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రారంభం...ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ఓటర్లు.బుధవారం ఉదయం 7 గంటలకు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమైంది. పోలింగ్ ప్రారంభమైనప్పటి నుంచే ఓటర్లు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు చేరుకుని తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. మహిళలు, వృద్ధులు, యువత ఉత్సాహంగా పోలింగ్‌లో పాల్గొంటున్నారు.

# రాష్ట్రంలో మెజార్టీ స్థానాలు కాంగ్రెస్‌వే....

**జోగిపేట పురపాలక పీఠంలో గెలుపు మాదే**

**రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర**

**జోగిపేటలో ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి**



**అందోల్ మేజర్ న్యూస్:**
రాష్ట్వావ్యాప్తంగా జరిగిన పురపాలక ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహా ధీమా వ్యక్తం చేశారు. పురపాలక ఎన్నికల్లో భాగంగా బుధవారం జోగిపేట పట్టణ ంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలోని పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నేతృత్వంలో అభివృద్ధి సంక్షేమ పథకాల వల్లనే కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఫలితాలు రానున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విశ్వాసం, నమ్మకం, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలు సంతృప్తితో ఉన్నారన్నారు. జోగిపేట మున్సిపాలిటీని కూడా మేమే కైవసం చేసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. తాను జోగిపేట మున్సిపాలిటీ ఏర్పడి మూడు సార్లు జరిగిన ఎన్నికల్లో ఓటు హక్కును వినియో గించుకుంటున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో కార్యకర్తలు చాలా కష్టపడి పనిచేసారని ఆయన అన్నారు. కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి, సునీల కుమార్, 9వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి మీనాలతో పాటు పలువురు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన మున్సిపల్ ఎన్నికలు

**జిన్నారంలో... 90 %శాతం పోలింగ్ నమోదు**

**గడ్డపోతారంలో ..86.08% శాతం పోలింగ్ నమోదు**

**ఉత్సాహంగా ఓటేసిన వృద్ధులు,దివ్యాంగులు**




**జిన్నారం మేజర్ న్యూస్:**
జిన్నారం,గడ్డపోతారం మున్సిపల్ పరిధిలో రెండవ సాధారణ ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. రెండు మున్సిపాలిటీలలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికల సంఘం ఓటు హక్కు వినియోగించుకునే ఓటర్లకు అవకాశం కల్పించింది.పోలింగ్ కేంద్రం వద్ద అధికారులు, పోలీసులు ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. ఆయా వార్డులలో కౌన్సిలర్ అభ్యర్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాజిపల్లి పోలింగ్ కేంద్రంలో 91 ఏళ్ల వరకంటి అంజయ్య యాదవ్ అనే వృద్ధుడు పోలింగ్ కేంద్రానికి నడుచుకుంటూ వచ్చి ఓటు వేయడం గమర్నహం. యువత, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు సైతం స్వచ్ఛందంగా ఓటింగ్ లో పాల్గొని ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. పారిశ్రామికవాడలో ఓటు వేసేందుకు ఓటర్లు ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. కాగా జిన్నారం మున్సిపాలిటీలోని 20 వార్డులలో 90.5 శాతంగా 11,350 ఓట్లు పోల్ అయ్యాయని, గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలో 18 వార్డులలో 86.08% శాతంగా పురుషులు 5,334, స్త్రీలు4981 మొత్తం ఓటర్లు 10,315 ఓట్లు పోలయ్యాయని ఆయా ఎన్నికల అధికారులు వెంకటరామయ్య, సిహెచ్ తిరుపతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బ్యాలెట్ బాక్స్ లను అధికారులు స్థానికంగా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములకు తరలించి భద్రతను కట్టుదిట్టం చేశారు. గడ్డపోతారం పోలింగ్ కేంద్రాన్ని బాలనగర్ ఏసిపి గంగాధర్, సిఐలు ఎం.రవీందర్ రెడ్డి, సత్యనారాయణ, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, అధికారులు తనిఖీ చేసి పోలింగ్ సరళి భద్రత వ్యవస్థలు పర్యవేక్షించారు.



# -కేసీఆర్ కప్‌లో లీగ్ మ్యాచ్‌లు ముగింపు

## నేటి నుంచి క్వార్టర్ ఫైనల్స్ ప్రారంభం..

**మార్కుక్ మేజర్ న్యూస్:**




బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని మర్కుక్ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న "కేసీఆర్ కప్" క్రికెట్ టోర్నమెంట్‌లో లీగ్ మ్యాచ్‌లు బుధవారం విజయవంతంగా ముగిశాయి. గురువారం నుంచి క్వార్టర్ ఫైనల్ పోటీలు ప్రారంభం కానున్నాయని మర్కుక్ సర్పంచి రాణి మల్లేశం తెలిపారు.మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఈ పోటీలో పాల్గొని క్రీడాస్ఫూర్తితో పోటీపడ్డాయి. లీగ్ దశలో అద్భుత ప్రతిభ కనబరిచిన జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధించాయి.క్వార్టర్ ఫైనల్‌కు చేరిన జట్లకు నిర్వాహకులు కొన్ని సూచనలు చేశారు. ఆటగాళ్లు సమయానికి మైదానానికి చేరుకోవాలని, క్రీడాస్ఫూర్తితో ఆడాలని, అంపైర్ల నిర్ణయాలను గౌరవించాలని సూచించారు. గెలుపొందిన జట్లకు ట్రోఫీలు, నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.ఇలాంటి క్రీడా పోటీలు గ్రామీణ యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు ఐక్యత, క్రమశిక్షణ, పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని సర్పంచి రాణి మల్లేశం పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కెసిఆర్ కప్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు క్రీడాకారులు తదితరులు ఉన్నారు.

# పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్

**సంగారెడ్డి సూర్య మేజర్ న్యూస్**



సంగారెడ్డి: మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పోలింగ్ ప్రక్రియపై నిశితంగా పరిశీలన చేసిన ఆయన, కొన్ని కేంద్రాల్లో ఏర్పాట్లలో లోపాలు ఉన్నాయని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు...ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికలు పూర్తిగా స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా జరగాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అధికార పార్టీ ప్రభావం, ఒత్తిడులు, అక్రమాలు చోటుచేసుకుంటే తీవ్రంగా ఎదుర్కొంటామని హెచ్చరించారు.కొన్ని చోట్ల ప్రతిపక్ష కార్యకర్తలను అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులు వచ్చాయని, అలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన మండిపడ్డారు. ఎన్నికల కమిషన్ తక్షణమే స్పందించి సమాన అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, డా.శ్రీహరి, శ్రీధర్ రెడ్డి,నాగరాజు గౌడ్, లాడే మల్లేశం, శ్రవణ్ రెడ్డి, మోహన్ సింగ్, లాడే బాలు తదితరులు ఉన్నారు

# పోలింగ్ కేంద్రాలను సందర్శించిన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి

**సంగారెడ్డి సూర్య మేజర్ న్యూస్**

మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా సంగారెడ్డి లోని పలు పోలింగ్ కేంద్రాలను కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి సందర్శించారు. పోలింగ్ తీరుతెన్నులను ఈ సందర్భంగా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ అభ్యర్థి భూమేష్,కాంగ్రెస్ నాయకులు లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



# ఎర్రవల్లి లో ఆయిల్ ఫామ్ గెలల సేకరణ

**మార్కుకు మేజర్ న్యూస్:**

రైతులు ఆయిల్ ఫామ్ సాగును సద్వినియోగం చేసుకొని అధిక లాభాలు సాధించాలని జిల్లా మేనేజర్ భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు మండలంలోని ఎర్రవల్లిలో బుధవారం ఆయిల్ ఫెడ్ ద్వారా ఆయిల్ ఫామ్ గెలల సేకరణ కేంద్రాన్నీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు ఆయిల్ ఫామ్ పంటలను సాగు చేసి ఏ విధంగా లాభాలు గణించే విధంగా చూడాలని అన్నారు అనంతరం గ్రామంలోని ధర్మకాంట వద్ద సర్పంచ్ కవిత రామ్ మోహన్ రెడ్డి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ గెలల కేంద్రానికీ మర్కుక్, వర్గల్, గజ్వేల్, ములుగు, జగదేవపూర్ మండలాల రైతులు పండించిన ఆయిల్ ఫామ్ గెలలలను సేకరించి ఇక్కడ నిల్వ చేస్తారు. నేటి నుండి రైతులకు కేంద్రం అందుబాటులోకి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమలో వ్యవసాయ అధికారి రాము జిల్లా కోఆర్డినేటర్ రాములు అర్టికల్చర్ ఆఫీసర్ సౌమ్య ఫీల్డ్ ఆఫీసర్ విజయ్ ఫీల్డ్ ఆఫీసర్ తులసి ఉప సర్పంచ్ సబితా కరుణాకర్ రైతులు సుధాకర్ రెడ్డి లక్ష్మణ్ రాజిరెడ్డి బిక్షపతి తదితర రైతులు పాల్గొన్నారు



## అక్షరశిల్పి ఏజాజ్ అహ్మద్ కు ఘన స్వాగతం పలికిన....

# విజ్ఞాన భారతి పాఠశాల విద్యార్థులు...

**అక్షరాల ఘనతను చాటిన......చేతి రాత నిపుణులు**

**విద్యార్థుల గుండెల్లో స్థానం.....**

**విద్యా రంగంలో అపూర్వ సేవలు....**

**చేతి వ్రాతతో తలరాత మారుతుంది.....**

**సాధనతో సాధించవచ్చు...**







**మిరుదొడ్డి, మేజర్ న్యూస్......**

చేతి వ్రాతలో మెళకువలను నేర్పే అక్షరశిల్పి ఏజాజ్ అహ్మద్ కు మండల కేంద్రంలోని విజ్ఞాన భారతి ఇంగ్లీష్ మీడియంశీ పాఠశాల విద్యార్థులు బుధవారం రోజున పూలగుచ్ఛం తో ఘన స్వాగతం పలికారు.జర్నలిజం, విద్యా రంగాల్లో అక్షరాల ఘనతను చాటుతూ, ప్రజల గుండెల్లో స్థానం సంపాదించిన ఆయన విద్యార్థులకు పాటలు, ఆటలు, పద్యాలు శ్లోకాలతో విద్యార్థులను ఆకట్టుకుంటూ తెలుగు , ఇంగ్లీష్, హిందీ భాషలలో అక్షరాలపై విద్యార్థులకు శిక్షణను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సత్తు సుజాత మాట్లాడుతూ అక్షర యోధులుగా వెలుగొందుతున్న 100 మంది తెలుగు జర్నలిస్టులకు పురస్కారాలు ఇవ్వబోతుండగా, విద్యా రంగంలో అపూర్వ సేవలందించిన సిద్ది పేట జిల్లాకు చెందిన ప్రముఖ చేతి వ్రాత నిపుణులు, వ్యాఖ్యాత, న్యూస్ రీడర్ ఎజాస్ అహ్మద్ అక్షరాలు వ్రాసే విధానం ను హర్షించారు. టిక టిక టిక, టిక, టికొక్కటి..“ అంటూ అందమైన చేతివ్రాతను సులభంగా వ్రాసే మెళకువలు నేర్చే ఎజాస్ అహ్మద్ గొప్ప తనాన్ని అభినందించారు. వీడియో యూట్యూబ్ లో 40 దేశాల్లో 10 కోట్లకు పైగా మంది ఇప్పటికే వీక్షిస్తున్నారని అన్నారు. సులభమైన రీతిలో సున్నాలు, గీతలతో లక్షలమంది చేతివ్రాతను అందంగా తీర్చిదిద్దగలిగారని అన్నారు. ఎజాస్. పాఠశాల ఉపాధ్యా యులకు విద్యార్థులకు తెలుగు, హిందీ, ఆంగ్ల భాషల్లో చేతివ్రాతపై 2650కి పైగా శిక్షణా తరగతులు నిర్వహించిన సేవలను గుర్తుచేశారు. సిద్ధిపేటకు చెందిన ఆయన 11 నవంబర్ 1965 లో జన్మించిన ఎజాస్ అహ్మద్ మొదట్లో చాలా కష్టమైన జీవితాన్ని అనుభవించి ఎంతో మంది తో మన్ననలు పొందుతున్న కళాకారుడని తెలిపారు.పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా పనిచేసి, తరువాత సిద్ధిపేటలో శుభోదయ విద్యాలయం పేరిట ప్రయివేటు పాఠశాలను స్థాపించి ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దాడని చెప్పారు.“అందమైన చేతిరాత అందరికీ సాధ్యమే“ అనే పుస్తకానికి రూపకల్పన చేశారు. అది 150 సార్లు ముద్రించబడి చాలా మంది రాతను మార్చిందన్నారు. మారుస్తునే ఉంది. “డిఫరెంట్ స్ట్రోక్స్” సంస్థ ద్వారాసాంఘిక సంక్షేమ, గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో, కరీంనగర్ లోని అన్ని కేజీబీవీ పాఠశాలలో, భారతీ ఫౌండేషన్ ద్వారా సిరిసిల్ల జిల్లాలోని 50కి పైగా ప్రభుత్వ పాఠశాలల్లో , మెదక్ జిల్లాలోని పీఎంశ్రీ పాఠశాలల్లో శిక్షణ తరగతులు నిర్వహిం చారన్నారు.బ్యాక్ టు నాలెడ్జ్ సంస్థ ద్వారా ఆన్ లైన్ లో చేతివ్రాత పై శిక్షణ ఇచ్చారన్నారు. దూరదర్శన్ తో బాటు బీబీసీ ఛానల్ లోను ఆయన వీడియోలు ప్రదర్శిం చబడ్డాయన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలతో బాటు పలుసంస్థలు ఘనంగా సత్కరించాయన్నారు. కాపురాజయ్య అంతర్జాతీయ ఆర్టిస్ట్ అవార్డ్, జాతీయస్థాయిలో సీఈడీ సంస్థ వారిచే “గ్రాండ్ జ్యూరీ నేషనల్ టీచర్ 2018” అవార్డు, “క్లాస్ మేట్” సంస్థ ద్వారా అవార్డు, లయన్స్ క్లబ్ వారిచే రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డ్, మెదక్ జిల్లా కలెక్టర్ చే “సామాన్యుల్లో అసామాన్యుడు” బిరుదు, మెదక్ ఎస్పీచే “అక్షరశిల్పి” బిరుదు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ద్వారా కీర్తి పురస్కారం అందుకున్న ఎజాస్ అహ్మద్ చేతివ్రాత నిపుణుడు మాత్రమే కాక మంచి గాయకుడు, వ్యాఖ్యాత, టీవీ న్యూస్ రీడర్, వ్యక్తిత్వ వికాస నిపుణుడు, సభా నిర్వాహకులు కూడా. అంతేకాకుండా ఎస్సెస్సీ ఛానల్ సిద్ధిపేటలో గత 20 సంవత్సరాలుగా వార్తలు చదువుతూ జీవనచిత్రం ప్రోగ్రాం ద్వారా సిద్ధిపేటలోని ప్రముఖులను పరిచయం చేయడంలో ప్రముఖ పాత్ర వహించారన్నారు. రాబోయే తరాలకు మార్గదర్శకుడుగా రాణిస్తున్న ఆయన కళ ముందు తరాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు.అనంతరం విద్యార్థులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఆంజనేయులు, సంపత్,తిరుమల రాణి, మంగ, స్వప్న, జ్యోత్స్న , వాణి తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## చేర్యాలలో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్




**చేర్యాల /మేజర్ న్యూస్**

చేర్యాల మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. బుధవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది.అభ్యర్థుల భవితవ్యాన్ని తేల్చేందుకు ఓటర్లు ఉదయం నుండే తమ ఓటు హక్కును వినియోగించుకొన్నారు.సాయంత్రం 5 గంటలలోపు క్యూ లైన్ లో ఉన్నవారికి ఓటు వేసేందుకు అధికారులు అవకాశం కల్పించారు.చేర్యాల మున్సిపాలిటీ పరిధిలో12 వార్డులు, 24 పోలింగ్ కేంద్రాలు ఉండగా మొత్తం 13777 మంది ఓటర్లు ఉన్నారు.వీరిలో పురుషులు 6658 మంది,మహిళలు 7119 మంది ఉన్నారు. పోలింగ్ పూర్తయ్యేవరకు మొత్తంగా 11491 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.వీరిలో పురుషులు 5626 మంది,మహిళలు 5865 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. చేర్యాలలో 83.41 పోలింగ్ శాతం నమోదయ్యిందని అధికారులు తెలిపారు..ఇక ఫలితాలు ఈ నెల 13వ తేదీన వెలువడనున్నాయి. శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఆ రోజు సాయంత్రంలోపు ఎన్నికల ఫలితాలు కూడా వెలువడనున్నాయి.ప్రధాన పార్టీలైనా బీజేపీ, బిఆర్ఎస్,కాంగ్రెస్ అభ్యర్థుల భవిత్యం ఎలా ఉండబోతుందో , ఓటర్లు తమ ఓటు ద్వారా ఇచ్చే తీర్పు ఎలావుంటుందో 13 వ తేదిన వెలువడే ఫలితాల్లో ఏర్పడనుంది.

## అనారోగ్యంతో యువకుడు మృతి

### ఆర్థిక సహాయం అందజేసిన యువకులు



**కొల్చారం సూర్య మేజర్ న్యూస్....**

మెదక్ జిల్లా కొల్చారం మండలం అనారోగ్యంతో యువకుడు మృతి చెందిన సంఘటన కొల్చారం మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది గ్రామానికి చెందిన బురిగల్ల రాములు 26 మృతి చెందాడు గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడడంతో ఆసుపత్రికి తరలించారు అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు మృతదేహాన్ని గ్రామానికి తరలించారు యువకుడు రాములు అందరితో కలుపుగోలుగా ఉండే వ్యక్తి కావడంతో గ్రామంలో ఉన్న యువకులు అందరూ కలిసి 5000 రూపాయలు వారి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంగమేశ్వర్ యూత్ అధ్యక్షులు సందీప్ ఉపాధ్యక్షులు గురు ప్రసాద్ అనిల్ పవన్ ఆనంద్ రవి ముదిరాజ్ రాజు తో పాటు పలువురు పాల్గొన్నారు

## గ్రామాల అభివృద్ధియే లక్ష్యంగా పనిచేద్దాం



**-ఎంపీడీవో రామరాజు, ఎమ్మార్వో స్వామి**

**సిద్దిపేట రూరల్, మేజర్ న్యూస్:**

అధికారులు, సర్పంచ్ లు గ్రామాల అభివృద్ధియే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేస్తేనే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని ఎంపీడీవో ఎస్ రామరాజు, ఎమ్మార్వో స్వామి లు పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీవో ఆఫీస్ లో మండల పరిధిలో నూతనంగా గెలుపొందిన సర్పంచ్, ఉప సర్పంచ్ లకు మండల స్థాయి అధికారుల తో పరిచయ కార్యక్రమం నిర్వహించి, మండలంలో ఉన్న శాఖల పనితీరును, వాటి అవసరాలను వివరిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో ఎలాంటి సమస్యలు ఉన్నా సంభందిత శాఖల అధికారులను సంప్రదించి, వారి సలహాలు సూచనలు పాటించాలన్నారు. కాగా ఈ కార్యక్రమంలో రెవెన్యూ, విద్యా, పంచాయతీరాజ్, ఎలక్ట్రిసిటీ, ఉపాధి హామీ, త్రాగునీటి, వ్యవసాయ శాఖ లకు సంబంధించిన అధికారులు తమ శాఖల పనితీరును వివరించి, వారి సందేహాలను నివృత్తి చేశారు. గ్రామాలలో త్రాగునీరు, పారిశుధ్యం, రహదారులు, వీధి దీపాలు, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల పనులను ప్రాధాన్యంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా సేవలందించాలని కోరారు.అనంతరం సర్పంచ్ లను అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో రజిత, ఏవో నరేష్, ఆయా గ్రామాల సర్పంచ్ లు, ఉప సర్పంచులు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గోన్నారు.



## శివరాత్రి వేడుకలకు సిద్ధమైన

# సంగమేశ్వర స్వామి దేవాలయం...

### భక్తుల రద్దీకి అన్ని ఏర్పాట్లు పూర్తి...
### సంగమేశ్వర సన్నిధిలో శివరాత్రి ఉత్సవాల సందడి...



**అమీన్ పూర్ మేజర్ న్యూస్**

అమీన్ పూర్ జిహెచ్ఎంసి పరిధిలోని కృష్ణారెడ్డిపేట ఐలాపూర్ గ్రామ శివారులోని పురాతన శ్రీ పార్వతి సమేత శ్రీ సంగమేశ్వర స్వామి దేవాలయం లో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించుటకు అన్ని రకాల ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. బుధవారం నాడు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహాశివరాత్రి కి చేస్తున్న ఏర్పాట్లను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ యొక్క పురాతన శివాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఈనెల 15 నుండి 16 వరకు నిర్వహించబడునని ఈ యొక్క బ్రహ్మోత్సవాలకు కిష్టారెడ్డిపేట ఐలాపూర్ మరియు చుట్టుపక్కన కాలనీవాసులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారని ఆ యొక్క భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. సుమారు 5000 నుండి 7000 వరకు భక్తులు తరలివస్తారని 16వ తారీఖున ఉదయం 9 గంటలకు శ్రీ పార్వతి సమేత సంగమేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం నిర్వహించబడును. మధ్యాహ్నం 12 గంటలకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించబడును. ఈ యొక్క కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని వారు కోరారు.

## ప్రశాంతంగా ముగిసిన మున్సిపల్ పోలింగ్

### జోగిపేటలో 79.40 శాతం పోలింగ్ నమోదు



**అందోల్ మేజర్ న్యూస్ :**

అందోల్ -జోగిపేట మున్సిపాలిటీ ఎన్నికల పోలింగ్ బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. అందోల్ జోగిపేట మున్సిపాలిటీ లోని 20 వార్డులుండగా మొత్తం 16.450 ఓటర్లు ఉన్నారు. కాగా ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 5 గంటల వరకు 79.40 పోలింగ్ శాతం నమోదయిందని ఎన్నికల అధికారి రవీందర్ తెలిపారు. 16.450 ఓటర్లు ఉండగా 13.061 మంది తమ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని ఆయన అన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద భారీ పోలీసు బందొబస్తూ ను స్థానిక సీఐ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. తమ తమ పోలింగ్ కేంద్రాల వద్ద ఆయా పార్టీల అభ్యర్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకున్న ఎమ్మెల్యే దంపతులు



**నారాయణఖేడ్ సూర్య మేజర్ న్యూస్**

నారాయణఖేడ్ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా స్థానిక శాసనసభ్యులు అనుపమ సంజీవరెడ్డి దంపతులు బుధవారం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తొమ్మిదో వార్డులోని ప్రభుత్వ ఉన్నత బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి చేరుకుని వారు ప్రశాంత వాతావరణంలో తమ ఓటును నమోదు చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఓటు అమూల్యమనే సందేశాన్ని ఇస్తూ, ప్రజలందరూ తప్పకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అనుపమ సంజీవరెడ్డి పిలుపునిచ్చారు. పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం సరైన నాయకత్వాన్ని ఎన్నుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తొమ్మిదో వార్డు అభ్యర్థి బాణాపురం రాజు, ముఖ్య నాయకులు మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లలో ఉత్సాహం కనిపించగా, మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ప్రజాస్వామ్య పండుగలో భాగంగా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఓటు హక్కు ను వినియోగించుకోవాలని నాయకులు ఆకాంక్షించారు.

## భక్తులకు సౌకర్యం... వ్రతాల షెడ్డు ప్రారంభోత్సవం...



**అమీన్ పూర్ మేజర్ న్యూస్**


అమీన్ పూర్ జిహెచ్ఎంసి సర్కిల్ పరిధిలోని బీరంగూడ డివిజన్ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం నూతనంగా నిర్మించిన సత్యనారాయణ స్వామి వ్రతాల షెడ్డు ను ఘనంగా ప్రారంభించారు. ఆలయ ఈవో శశిధర్ గుప్తా, ఆలయ చైర్మన్ సుధాకర్ యాదవ్ ఆలయ ధర్మకర్తలు మరియు అర్చక స్వాములతో కలిసి రిబ్బన్ కట్ చేసి షెడ్డును భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఈవో శశిధర్ మాట్లాడుతూ... భక్తులకు సౌకర్యవంతంగా వ్రతాల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేసాం, వర్షం ఎండల నుంచి రక్షణ కలిగేలా విశాలమైన షెడ్డు నిర్మాణం ఏర్పాటు చేశాం, ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా కొత్త సదుపాయం నిర్వహించాం. భవిష్యత్తులో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఆయన అన్నారు. భక్తులు తమ మొక్కులు తీర్చుకోవడానికి సత్యనారాయణ స్వామి వ్రతాల కోసం ఇకపై ఈ ప్రత్యేక షెడ్యూల్ వినియోగించుకోవచ్చు అని తెలిపారు.

## విజేత దినపత్రిక క్యాలెండర్ ను ఆవిష్కరించిన అధికారులు

**రాయికోడ్, సూర్య మేజర్ న్యూస్**



మండల కేంద్రమైన రాయికోడ్ లోని తహసీల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ ఆశ జ్యోతి, నాయబ్ తహసీల్దార్ నరేష్,ఆర్ఐ శ్రీకాంత్, కార్యాలయ సిబ్బంది,సిరూర్ గ్రామ ఉపసర్పంచ్ శివకుమార్మరియు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎంఎం షరీఫ్, సూపరిండెంట్ నర్సింహారెడ్డి,ఏపీఓ రమేష్, కార్యాలయ సిబ్బంది తదితరులు బుధవారం నాడు విజేత దినపత్రిక 2026 క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దినపత్రికలు ప్రజాసమస్యలను వెలికితీసి వాటి పరిష్కారం కొరకు కృషి చేయాలని తెలిపారు.



## ప్రశాంతంగా మున్సిపల్ పోలింగ్

### మెదక్ మున్సిపాలిటీలో 100 శాతం ఓటింగ్ జరగాలి.
### సాధారణ పరిశీలకులు రవి కిరణ్



**మెదక్ మేజర్ న్యూస్ ప్రతినిధి....**

మున్సిపల్ ఎన్నికల పోలింగ్ పక్రియ ప్రశాంతంగా జరుగుతున్నట్లు సాధారణ పరిశీలకులు రవి కిరణ్ స్పష్టం చేశారు. బుధవారం మెదక్ మున్సిపల్ పరిధిలో ఉన్న పలు వార్డులలో,పోలింగ్ కేంద్రలలో విస్తృతంగా పర్యటించి పరిశీలించారు. పోలింగ్ సిబ్బందిని, పోలింగ్ కేంద్రానికి వచ్చిన ఓటర్లను ఓటింగ్ ఏర్పాట్లు ఎలా ఉన్నాయంటూ తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సాధారణ పరిశీలకులు రవి కిరణ్ మాట్లాడుతూ.. మెదక్ మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నాయన్నారు. మెదక్ జిల్లా మున్సిపల్ ప్రజలు పెద్ద ఎత్తున ఓటింగ్ లో పాల్గొని మెదక్ మున్సిపాలిటీలో 100 శాతం ఓటింగ్ జరగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, మెదక్ ఆర్డీవో రమాదేవి,డి ఎస్ పి ప్రసన్న కుమార్, మెదక్ తహసిల్దార్ లక్ష్మణ్ బాబు ,ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికల సరళిని పరిశీలించి.. ఓటు హక్కు వినియోగించుకున్న సబ్ కలెక్టర్

**నారాయణఖేడ్ సూర్య మేజర్ న్యూస్**

మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా బుధవారం నారాయణఖేడ్ మున్సిపాలిటీకి సంబంధించి జరుగుతున్న ఎన్నికల సరళిని పరిశీలించిన సబ్ కలెక్టర్ ఉమా హారతి ఓటు హక్కును వినియోగించుకున్నారు ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి పోలీసు భద్రతను పెంచడం జరిగిందన్నారు. సాయంత్రం 7 గంటల వరకు పోలింగ్ సరళిని కొనసాగించడం జరుగుతుందని తెలిపారు. 70 శాతం నమోదైనట్లు తెలిపారు. ప్రజలు సకాలంలో ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు.



# జగ్గారెడ్డి పై బిఆర్ఎస్ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఫైర్



**సంగారెడ్డి సూర్య మేజర్ న్యూస్**

జగ్గారెడ్డి పై బిఆర్ఎస్ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు జగ్గారెడ్డి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. పోలీసులను, ప్రభుత్వ సిబ్బందిని భయపెట్టే విధంగా జగ్గారెడ్డి ప్రవర్తిస్తున్నారని అన్నారు.సంగారెడ్డి లో పోలీసులపై జగ్గారెడ్డి మాట్లాడిన తీరు పూర్తిగా అవమానకరమని చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో డీజీపీ స్వయంగా చర్యలు తీసుకోవాలని కోరారు."పోలింగ్ సమయంలోనే ఇలా ప్రవర్తిస్తే, కౌంటింగ్ సమయంలో పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు" అని ఆయన వ్యాఖ్యానించారు.పాడి కౌశిక్ రెడ్డి వ్యవహారంలో పోలీస్ సంఘాలు ఎలా స్పందించాయో, ఇప్పుడు కూడా అదే విధంగా స్పందించాలని చింతా ప్రభాకర్ సూచించారు.అదేవిధంగా, యాక్టివ్‌గా ఉన్న బిఆర్ఎస్ కార్యకర్తలను పోలీసులు బైండోవర్ చేస్తున్నారని ఆరోపించిన ఆయన, బైండోవర్ చేయాల్సి వస్తే ముందుగా జగ్గారెడ్డినే బైండోవర్ చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమం లో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, డా.శ్రీహరి, మందుల వరలక్ష్మి, శ్రీధర్ రెడ్డి,మల్లగౌడ్, కొండల్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, మల్ల గౌడ్ తదితరులు ఉన్నారు.

# రసాయన పరిశ్రమల్లో భద్రతపై వర్క్ షాప్

## హాజరైన డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జి.నెహ్రు
## కాజిపల్లి మ్యాట్రిక్స్ పరిశ్రమలో పారిశ్రామికవేత్తలతో సమావేశం




**జిన్నారం మేజర్ న్యూస్:**

గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని కాజీపల్లి పారిశ్రామిక వాడకు చెందిన మ్యాట్రిక్స్ పరిశ్రమలో ప్రాసెస్ సేఫ్టీ మేనేజ్మెంట్ అంశంపై డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జి. నెహ్రు వర్క్ షాపును నిర్వహించారు.ఈ సందర్భంగా పారిశ్రామికవేత్తలకు, ప్రతినిధులకు పరిశ్రమల్లో తీసుకుంటున్న భద్రత అంశాలపై తగు సూచనలు సలహాలను అందించారు. పేలుళ్లు, అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. తద్వారా ప్రాణ నష్టం, ఆస్తి నష్టం పర్యావరణ విఘాతం కలిగే అవకాశం ఉండదన్నారు. నామమాత్రంగా కాకుండా బాధ్యతగా వ్యవహరించి ప్రమాదాలను నివారించాలన్నారు. కార్యక్రమంలో పరిశ్రమల ప్రతినిధులు దామోదరం రెడ్డి, నాగేశ్వరరావు, శ్రీపతి, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతం

## - 70 శాతానికిపైగా పోలింగ్ - శుక్రవారమే ఫలితాలు

తెలంగాణ మున్సిపల్ ఎన్నికలు చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిశాయి. ప్రధాన నేతలంతా తమ తమ మున్సిపాల్టీల్లో పార్టీని గెలిపించేందుకు సర్వశక్తులు ఒడ్డారు.తెలంగాణలో స్థానిక సంస్థల సమరంలో భాగంగా మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ఘట్టం ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా బుధవారం జరిగిన ఈ ఎన్నికల ప్రక్రియలో ఓటర్లు ఉత్సాహంగా పాల్గొనడంతో చాలా మున్సిపాలిటీల్లో భారీగా పోలింగ్ నమోదైంది. చెదురుమదురు ఘటనలు మినహా రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా సాగిందని రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది.

***భారీగా నమోదైన పోలింగ్ శాతం***

రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలోని మొత్తం 2,981 వార్డు డివిజన్లకు ఈ ఎన్నికలు జరిగాయి. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. మధ్యాహ్నం 3 గంటల సమయానికే రాష్ట్ర సగటు పోలింగ్ 62 శాతంగా నమోదు కాగా, సాయంత్రం ముగిసే సమయానికి అనేక ప్రాంతాల్లో ఈ శాతం 70 దాటినట్లు తెలుస్తోంది. మొత్తం 52.43 లక్షల మంది ఓటర్లకు గానూ భారీ సంఖ్యలో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సుమారు 12,944 మంది అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమైంది. పూర్తి ఓటింగ్ పర్సంటేజీపై గురువారం క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

***చెదురుమదురు ఘటనలు - భారీ భద్రత***

పోలింగ్ సందర్భంగా కొన్ని ప్రాంతాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల కార్యకర్తల మధ్య చిన్నపాటి వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. సంగారెడ్డి, నాగర్‌కర్నూల్ వంటి జిల్లాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద స్వల్ప ఉద్రిక్తతలు తలెత్తినప్పటికీ, పోలీసులు వెంటనే జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 41,773 మంది పోలింగ్ సిబ్బంది విధుల్లో పాల్గొనగా, శాంతిభద్రతల పరిరక్షణ కోసం 3,000 మంది అదనపు పోలీసు బలగాలను మోహరించారు. వెబ్‌కాస్టింగ్ ద్వారా ఎన్నికల కమిషన్ ప్రతి పోలింగ్ కేంద్రాన్ని నిశితంగా పర్యవేక్షించింది. కౌంటింగ్ ఏర్పాట్లు - ఫలితాల వెల్లడి బ్యాలెట్ బాక్సులను కట్టుదిట్టమైన భద్రత మధ్య స్ట్రాంగ్ రూమ్‌లకు తరలిస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 13వ తేదీ శుక్రవారం ఉదయం నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 136 కౌంటింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. కౌంటింగ్ పూర్తయిన వెంటనే ఫలితాలను ప్రకటించి, గెలిచిన అభ్యర్థుల వివరాలను అధికారికంగా వెల్లడిస్తారు.

# ఐదు మున్సిపాలిటీల్లో పోలింగ్ ప్రక్రియ

**పటాన్ చెరు మేజర్ న్యూస్**

# విజయవంతం....

- ◆ఉదయం నుంచే ఓటర్ల క్యూలు....
- ◆మహిళలు వృద్ధులు ఉత్సాహంగా ఓటు హక్కు వినియోగం...
- ◆కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు... సజావుగా ఓటింగ్....
- ◆ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన సహాయ కేంద్రాలు...
- ◆దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు...
- ◆ప్రధాన పార్టీల అభ్యర్థుల మధ్య తీవ్ర పోటీ వాతావరణం నెలకొంది....
- ◆గెలుపు పై అన్ని పార్టీల్లోనూ దిమా....



పటాన్ చేరు నియోజకవర్గంలోని ఐదు మున్సిపాలిటీ ఎన్నికల పోలింగ్ బుధవారం ప్రశాంతంగా ముగింపు, ఉదయం నుంచే ఓటర్లు క్యూలు కట్టారు. ఇస్నాపూర్, ఇంద్రేశం, గడ్డపోతారం, జిన్నారం, గుమ్మడిదల పురపాలికల్లో శాంతియుత వాతావరణంలో పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. మహిళలు యువత వృద్ధులు ఉత్సాహంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. హోరా హోరి పోటీ నేపథ్యంలో భారీగా పోలింగ్ శాతం నమోదయింది. అని అధికారులు తెలిపారు.గుమ్మడిదల మున్సిపాలిటీ 22 వార్డులు ఉండగా మొత్తం ఓటర్ సంఖ్య 23926 ఉన్నారు. ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం ఐదు గంటల వరకు 19514 ఓటర్లు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.81 శాతం పోలింగ్ నమోదయిందని ఎన్నికల అధికారి తెలిపారు. ఇంద్రేశం మున్సిపాలిటీ 18 వార్డులు ఉండగా 13086 ఓటర్లు ఉన్నారు. కాగా 11102 మంది తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. 84.84 శాతం పోలింగ్ నమోదు అయిందని ఎన్నికల అధికారి తెలిపారు. జిన్నారం మున్సిపాలిటీ 20 వార్డులు ఉండగా మొత్తం ఓటర్ల సంఖ్య 12475 ఓటర్లు ఉన్నారు. ఇందులో 11350 మంది తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ శాతం 90.98 శాతం పోలింగ్ నమోదు అయిందని ఎన్నికల అధికారి తెలిపారు. గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలో 18 వార్డులు ఉండగా మొత్తం ఓటర్ల సంఖ్య 11983 ఉన్నారు.10315 మంది తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. 86.08 శాతం పోలింగ్ నమోదయింది. ఇస్నాపూర్ మున్సిపాలిటీ 26 వార్డులు ఉండగా మొత్తం ఓటర్ల సంఖ్య 35912 ఉన్నారు. 28928 మంది తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. 80.55 శాతం పోలింగ్ నమోదయింది అని ఎన్నికల అధికారి తెలిపారు.



# సత్తా చాటిన మ్యాచ్ పాయింట్ అకాడమీ క్రీడాకారులు







రవీంద్ర భారతి, మేజర్ న్యూస్ 11 : చిన్నారులను పాఠశాల స్థాయి నుంచి విద్యతోపాటు క్రీడలలోనూ ప్రోత్సహించాలని అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సాత్విక్ రెడ్డి అన్నారు. గత నాలుగు రోజులుగా ఇండోర్ స్టేడియంలో ది గాడియమ్ పాఠశాల ఆధ్వర్యంలో జరుగుతున్న ది గాడియమ్ 6వ ఎడిషన్ తెలంగాణ రాష్ట్ర ఓపెన్ సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్ బుధవారంతో ముగిసింది. ఈ టోర్నీలో మ్యాచ్ పాయింట్ అకాడమీకి చెందిన క్రీడాకారులు అద్భుత ప్రతిభను కనబరిచారు. అండర్ 13 విభాగంలో కేయ కోసరాజు మొదటి స్థానంలో నిలువగా, అండర్ 11 బాలికల డబుల్స్ విభాగంలో నర్రా హర్షిని, శాన్వి లు రజత పతకాన్ని గెలుచుకున్నారు. ఈ సందర్భంగా మ్యాచ్ పాయింట్ అకాడమీ వ్యవస్థాపకులు ముప్పాల వేణు మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో తమ సంస్థ నుంచి మరింతమంది క్రీడాకారులను దేశానికి అందించడమే లక్ష్యమని వెల్లడించారు. తమ అకాడమీ కోచింగ్ సిబ్బంది ఎంతో క్రమశిక్షణతో శిక్షణ ఇవ్వడమే మా విజయాలకు కారణమని తెలిపారు. అనంతరం వివిధ విభాగాలలో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ కోచింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాటమరాజు జయంతిని అధికారికంగా నిర్వహించాలి

- కాటమరాజు చరిత్రను పాఠ్యాంశ పుస్తకాలలో చేర్చాలి
- ఈనెల 14న కాటమ రాజు జయంతిని గ్రామ, గ్రామాన నిర్వహించాలి
- యాదవ జె.ఎ.సి చైర్మన్ డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్



వనస్థలిపురం,మేజర్న్యూస్ఃదక్షిణ భారత దేశ బహుజనుల రాజు అయిన

కాటమరాజు జయంతిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని యాదవ జెఎసి చైర్మన్ డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. కాటమరాజు చరిత్రను పాఠ్యాంశ పుస్తకాలలో చేర్చాలన్నారు. ఈనెల 14వ తేదీన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో కాటమరాజు జయంతి వేడుకలను యాదవులు, బహుజనులు అందరూ కలిసి గ్రామ, గ్రామాన భారీ ఎత్తున నిర్వహించాలని అజయ్ కుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. దక్షిణ భారత దేశంలో పశు సంపదను కాపాడిన గొప్ప వీరుడు కాటమరాజు అని, నోరు లేని పశువుల కోసం పోరాటం చేసిన మహనీయుడు కాటమరాజన్నారు. మానవాళికి పాలు, పెరుగును, నెయ్యిని పరిచయం చేసిన గొప్ప నాయకుడు అని తెలిపారు. కాటమరాజు తన రాజ్యంలో సబ్బండ వర్గాల ప్రజలకు బహుజనులకు పెద్ద పీట వేశారన్నారు. కాటమరాజు పోరాట స్ఫూర్తిని నేటి యువతరం ఆదర్శంగా తీసుకోవాలని ఆయన సూచించారు.

# చేసింది చారెడు చెప్పుకునేది బారెడు

- తాజా మాజీ కార్పోరేటర్ తీరుపై జిట్టా గరం
- గత టి.ఆర్.ఎస్ హయాంలోనే ఎల్బీనగర్ నియోజకవర్గంలో 5వేల 5 వందల కోట్ల రూపాయల అభివృద్ధి పనులు జరిగాయి
- కాంగ్రెస్ కార్పోరేటర్లు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలి
- వనస్థలిపుర ం మాజీ కార్పోరేటర్ జిట్టా రాజశేఖర్రెడ్డి

వనస్థలిపురం,మేజర్న్యూస్ఃవనస్థలిపురం ప్రాంతంలో ఒక సారి కౌన్సిలర్గా, రెండు సార్లు కార్పోరేటర్గా తాను అన్ని విధాలుగా అభివృద్ధి చేశానని, తాజా మాజీ కార్పోరేటర్ రెండేళ్ల ఆయన పదవీకాలంలో చేసింది సారెడైతే చెప్పుకునేది బారెడుగా ఉందని వనస్థలిపురం డివిజన్ మాజీ కార్పోరేటర్ జిట్టా రాజశేఖర్రెడ్డి ఆరోపించారు. ఏదో కొన్ని పనులు చేయించవచ్చు కానీ మొత్తం నేనే చేయించానని చెప్పుకోవడం, టెండర్ ప్రాసెస్లో ఉన్న వాటిని కూడా చేశామని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బుధవారం కాంప్లెక్స్లోని బి.ఆర్.ఎస్ కార్యాలయంలో బి.ఆర్.ఎస్ నాయకులతో కలిసి జిట్టా రాజశేఖర్రెడ్డి మాట్లాడుతూ వనస్థలిపురం ఏర్పాటు సమయంలో కేవలం రెడ్ వాటర్ ట్యాంక్, గ్రీన్ వాటర్ట్యాంక్, వైట వాటర్ట్యాంకులు మాత్రమే ఉండేవని,



పెరుగుతున్న జనాభా, పెరిగిన కాలనీలకు అనుగుణంగా నేను, ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్రెడ్డి వనస్థలిపరం లో మరెన్నో వాటర్ రిజర్వాయర్లు కట్టించి ప్రజలకు మెరుగైన తాగునీటిని అందించామని, అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీని పునర్మించి,ట్రంక్ లైన్లు ఏర్పాటు చేసి, బాక్స్ డ్రైన్లు ఏర్పాటు చేయించి డివిజన్లలో మురుగునీటి సమస్య పరిష్కారం చేశామన్నారు. ఏదో కొన్ని పనులు చేసి అంతాతానే చేశానని చెప్పుకోవడం అంటే ప్రజలను పిచ్చోళ్లను చేయడమేనని, ఇదంతా ప్రజలు నమ్మరని ఎవరేం చేశారో వనస్థలి వాసులకు తెలుసని జిట్టా రాజశేఖర్రెడ్డి అన్నారు. గత టి.ఆర్.ఎస్ ప్రభుత్వ హాయాంలోనే ఎల్బీనగర్ నియోజకవర్గంకు 5వేల 5 వందల కోట్ల రూపాయల నిధులతో అన్ని విధాలుగా అభివృద్ధి చేశామని, ఇపుడున్న ప్లై ఓవర్లు, అండర్ పాస్లు, వరద నీటి కాలువల ఏర్పాటు వారికి కనబడడం లేదా అన్ని ప్రశ్నించారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, ఏదో కొంత చేసి అంతా తామే చేశామని చెబితె ప్రజలు నమ్మరని ఆయన హితవు పలికారు. కాంగ్రెస్ కార్పోరేటర్లు, నియోజకవర్గం ఇన్చార్జ్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని లేదంటే తగిన చర్యలు తప్పవని జిట్టా రాజశేఖర్రెడ్డి హెచ్చరించారు. ఈ సమావేశంలో వనస్థలిపురం డివిజన్ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ లగ్గోని శ్రీధర్గౌడ్, ఉద్యమ నాయకులు దూసరి మధుగౌడ్, సీనియర్ నాయకులు జి.ఆనంద్రాజ్, వనస్థలిపురం డివిజన్ సోషల్ మీడియా కన్వీనర్ రవికుమార్, వెంకీ తదితరులు పాల్గొన్నారు.

# పట్టపగలు చైన్ స్నాచింగ్



హిమాయత్ నగర్ , మేజర్ న్యూస్ : హాస్పటల్లో పని ముగించుకొని హాస్టల్ కి వెళుతున్న నర్సు మెడలోని బంగారు చైనును దుండగుడు లాక్కెళ్ళిన ఘటన అబిడ్స్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. ఇన్స్పెక్టర్ పరశురాం వివరాల ప్రకారం.. అబిడ్స్ చాపల్ రోడ్డు లోని మల్లారెడ్డి హాస్పిటల్ లో నర్సుగా పని చేస్తున్న శిరీష పని ముగించుకొని ఉదయం అదే రోడ్ లో నీ తను ఉంటున్న మౌనిక ప్రైవేట్ లేడీస్ హాస్టల్ కు వెళ్తుంది. ఈ సమయంలో గుర్తు తెలియని దుండగుడు ఆమెను వెంబడించి , మెడలోని 2.5 తులాల బంగారు గొలుసులు లాక్కొని పరారయ్యాడు. ఈ విషయం తెలిసిన వెంటనే స్టేషన్ సెంట్రీ హాస్టల్ కి వెళ్లి జరిగిన ఘటనపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడే క్రైమ్ నెంబర్ 42/2016, సెక్షన్ 304 బి ఎన్ ఎస్ ప్రకారం, ఎఫ్ ఐ ఆర్ నమోదు చేసిన పత్రాన్ని ఇన్స్పెక్టర్ ఆమెకు అందజేశారు. సీసీ కెమెరాలు, లభించిన ఆనవాళ్ళ ప్రకారం దొంగను పట్టుకునేందుకు తదుపరి ఇన్వెస్టిగేషన్ సాగిస్తున్నట్లుగా తెలిపారు.

# నేటి దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి




వనస్థలిపురం,మేజర్న్యూస్ఃకేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12 వ తేదీ నిర్వహిస్తున్న దేశ వ్యాప్త సమ్మెను కార్మిక లోకం జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు తెలిపారు. ఈ మేరకు సిఐటియు ఆధ్వర్యంలో హయత్నగర్, ఎల్బీనగర్, సరూర్నగర్ సర్కిల్ల పరిధిలో జీపు జాత ద్వారా వారు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు హయత్నగర్ సర్కిల్ కన్వీనర్ చింతపల్లి కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిఐటియు రంగారెడ్డి జిల్లా మాజీ ఉపాధ్యక్షులు కీసరి నర్సిరెడ్డి పాల్గొని కార్మికులు కొట్లాడి సాధించుకున్న 29 లేబర్ చట్టాలను మోడీ ప్రభుత్వం రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చిందన్నారు. ఈ లేబర్ కోడ్లు అమలు అయితే కార్మికులకు ఉద్యోగ బధ్రత లేకుండా పోతుందని, ఈఎస్ఐ, పిఎఫ్ వంటి సదుపాయాలు కోల్పోతారని, 8 గంటల పని విధానం పోయి 12 గంటల పని విధానం వస్తుందన్నారు. సంఘం పెట్టాలంటే కఠినమైన ఆంక్షలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మల్లేపాక వీరయ్య, సిఐటియు ట్రాన్స్పోర్ట్ జిల్లా అద్యక్షుడు ముషం నరహరి, నాయకులు వెంకన్న, రామస్వామి, లక్ష్మణ్, శివ, కార్మికులు పాల్గొన్నారు.

# గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మియాపూర్,మేజర్ న్యూస్ : గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి ఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో తెల్లవారుజామున చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలను మియాపూర్ ఎస్ఐ మల్లేశం తెలిపిన వివరాల ప్రకారం బుధవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో సుమారు 45--50 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి మదీనాగూడ మియాపూర్ నుండి లింగంపల్లి వైపు వెళ్లే రహదారిపై, అర్చన ఆసుపత్రి ఎదురుగా గుర్తు తెలియని టిప్పర్ వాహనం ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని స్థానికులు వెంటనే పి.ఆర్.కె ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ వాహనం,డ్రైవర్ను గుర్తించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు మియాపూర్ పోలీస్ స్టేషన్ను సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

## రైతుల విజ్ఞప్తికి స్పందించిన...

# మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి...

**నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్ష సమావేశం..**
**రంగనాయక సాగర్ కు దుబ్బాక ప్రధాన కాలువకు నీటి విడుదల**
**నేడు కూడవెల్లికి మల్లన్న సాగర్ నుండి నీటి విడుదల.**
**రెండు మసాల్లో ఇర్కోడు ఎత్తిపోతల పథకం పనులు పూర్తి..**



**దుబ్బాక మేజర్ న్యూస్.**

మాజీ మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆదేశాలతో రైతుల సాగునీటి కోసం సమస్య తీరనుంది. మల్లన్న సాగర్ నిండా గోదావరి జలాలు ఉన్నప్పటికీ విడుదల చేయకపోవడంతో పంటలు ఎండే పరిస్థితి దాపురించిందని రైతులు హరీష్ రావు ప్రభాకర్ రెడ్డి ల దృష్టికి తీసుకెళ్లారు. వారు వెంటనే రంగనాయక సాగర్ లోని నీటిపారుదల శాఖ కార్యాలయంలో సాగునీటి సమస్యలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పంట పొలాలు ఎండిపో తున్నాయని వెంటనే రంగనాయక సాగర్ ప్రాజెక్టు లోకి దుబ్బాక ప్రధాన కాలువ తో పాటు కూడవెల్లి వాగులోకి నీళ్లు విడుదల చేయాలని వారు అధికారులను ఆదేశించారు. వీరి ఆదేశాలతో అప్రమత్తమైన అధికారులు రంగనాయక సాగర్ కు దుబ్బాక ప్రధాన కాలువకు వెంటనే నీటిని విడుదల చేశారు. నేటి అనగా గురువారం కూడవెల్లి వాగులోకి కొడకండ్ల వద్ద నీటిని విడుదల చేయడం జరుగుతుందని అధికారులు తెలిపారు. అలాగే గత ప్రభుత్వం నిధులు విడుదల చేసినప్పటికీ ఇరుకోడు ఎత్తిపోతల పథకం పూర్తి కాకపోవడంపై వారు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రెండు మాసాల్లోగా ఇర్కోడు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి నీళ్లు అందిస్తామని వారు హామీ ఇచ్చారు.

**హర్షం వ్యక్తం చేస్తున్న రైతన్నలు**

ఇప్పటికే కూడవెల్లి వాగులోని నీళ్లు ఇంకిపోవడంతో పంట పొలాలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. అలాగే దుబ్బాక ప్రధాన కాలువ వెంట పంట పొలాలు ఎండిపోతున్నాయి చెరువుకుంటల్లో నీరు తగ్గిపోవడంతో పంట పొలాలు ఎండిపోయే పరిస్థితి ఉండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో మాజీ మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి నీటిని విడుదల చేయాలని అధికారులను ఆదేశించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# ప్రభుత్వ అసైన్డ్ భూములు, కాలువలు కబ్జా

(మొదటి పేజీ తరువాయి..)

చేయడం, 33 ఫీట్ల రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయడం, పాఠశాల, దేవాలయం, క్రీడా ప్రాంగణం వంటి అవసరాలకు స్థలం కేటాయించడం నిబంధనల ప్రకారం చేయాల్సిందే. కానీ పలుచోట్ల ఈ నిబంధనలు పాటించకుండా ప్రహరీ గోడలు కట్టి, గేట్లు ఏర్పాటు చేసి గేటెడ్ కమ్యూనిటీ పేరుతో ప్లాట్లు అమ్ముతున్నట్లు సమాచారం. ప్రక్కనున్న రైతులకు దారులు ఇవ్వకుండా మూసివేస్తున్న ఘటనలూ వెలుగులోకి వస్తున్నాయి.

**'గజాలు' కాదు 'గుంటలు' నమోదు**

ప్రభుత్వ నియంత్రణ నుంచి తప్పించుకునేందుకు కొందరు రియల్టర్లు ప్లాట్లను గజాల్లో కాకుండా గుంటల లెక్కన రిజిస్ట్రేషన్ చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన ఫీజులు ఎగ్గొట్టడమే కాకుండా, కొనుగోలు దారులు కూడా భవిష్యత్తులో ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంటోంది. ఇల్లు నిర్మించాలన్నా, రుణాలు పొందాలన్నా, ఎల్ఆర్ఎస్ లేదా ఇతర రెగ్యులరైజేషన్ పథకాల భారం కొనుగోలు దారులపైనే పడే అవకాశం ఉంది. తక్కువ ధరకు దొరుకుతుందని ఇప్పుడు కొనుగోలు చేసిన వారు తరువాత ఆర్థికంగా ఇబ్బందులు పడే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**ప్రభుత్వ భూములపై వెంచర్లు?**

మునిదేవునిపల్లి, మాదాపూర్, కోనాపూర్ శివార్లలో పలు వెంచర్లపై తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్నిచోట్ల నాళాలు, కుంటలు కబ్జా అయ్యాయని, మరికొన్నిచోట్ల ప్రభుత్వ రహదారులు ఆక్రమణకు గురయ్యాయని స్థానికులు చెబుతున్నారు. అసైన్డ్ భూముల్లోనూ రోడ్లు వేసి ప్లాట్లు విక్రయిస్తున్న ఘటనలు బయటపడుతున్నాయి. కాలువల్లో మట్టి పోసి రోడ్లు వేసుకోవడం, పారకం కాలువలను పూడ్చివేయడం వంటి చర్యలు సాగుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**నోటీసులకే పరిమితమా చర్యలు?**

గ్రామ, మండల స్థాయి అధికారులు కొన్ని సందర్భాల్లో పై అధికారులకు నివేదికలు అందిస్తున్నామని చెబుతున్నా, క్షేత్ర స్థాయిలో చర్యలు కనిపించడం లేదని ప్రజలు అంటున్నారు. అక్రమాలపై పత్రికల్లో ఆధారాలతో వార్తలు వెలువడుతున్నప్పటికీ జిల్లా స్థాయి తనిఖీలు తూతూ మంత్రంగానే సాగుతున్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. "పేదలకు మాత్రం నిబంధనలు కఠినంగా అమలు చేస్తారు. కానీ పెద్ద వెంచర్ల విషయంలో ఎందుకు సడలింపు?" అని రైతులు ప్రశ్నిస్తున్నారు.

**సమగ్ర విచారణకు డిమాండ్**

అనుమతుల్లేని వెంచర్లపై సమగ్ర విచారణ జరిపి, అమ్మకాలను నిలిపివేసి, సంబంధిత నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామాల ప్రజలు, రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలగకుండా, భవిష్యత్తులో కొనుగోలు దారులు మోసపోకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు

# రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైన, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ( అనిత)

**వట్టిపల్లి ,సూర్య మేజర్ న్యూస్.**



వట్టిపల్లి మండలం, అంబోజ బొగుడ ,మేఘవత్ అనిత ,తండ్రి గోవర్ధన్ 10.2 ,26 నాడు జిల్లాస్థాయి సీఎం కప్ యోగ పోటిలో పాల్గొన్నది .జిల్లా స్థాయి నుండి రాష్ట్రస్థాయి యోగ పోటీకి ఎంపికైనట్లు వట్టిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రంజిత్ కుమార్ తెలిపినారు .ఈనెల 21,వ తేదీ నుండి 24,వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటుందని ఆయన అన్నారు. అనిత స్వయంకృషి, హిందీ పండిత్ విజయ్ కుమార్, ప్రోత్సహం ,సలహాతో తాను యోగా నేర్చుకుంటున్నట్లు తెలిపినది. రాష్ట్ర స్థాయి అవార్డు పొంది, మున్ముందు ఇంకా విజయాలు సాధించాలని ,గ్రామ సర్పంచ్ ఎం రవీందర్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ మోసినా బేగం, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, త

# దుబ్బాకలో మున్సిపల్ ఎన్నికల్లో 85.05శాతం

**దుబ్బాక మేజర్ న్యూస్....**

దుబ్బాక మున్సిపల్ ఎన్నికల్లో మొత్తం 20 వార్డుల లో 85.05శాతం జరిగింది వార్డుల వారిగాఈ విధంగా ఉన్నాయి.

# మున్సిపల్ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకున్న ఎంపీ కుటుంబ సభ్యులు



**నారాయణఖేడ్ సూర్య మేజర్ న్యూస్**

నారాయణఖేడ్ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఎంపీ సురేష్ కుమార్ షట్కర్ కుటుంబ సమేతంగా బుధవారం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 7వ వార్డ్ ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి చేరుకుని వారు ప్రశాంత వాతావరణంలో తమ ఓటును నమోదు చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఓటు అమూల్యమనే సందేశాన్ని ఇస్తూ, ప్రజలందరూ తప్పకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్ పిలుపునిచ్చారు. పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం సరైన నాయకత్వాన్ని ఎన్నుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లలో ఉత్సాహం కనిపించగా, మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ప్రజాస్వామ్య పండుగలో భాగంగా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని నాయకులు ఆకాంక్షించారు.

# మున్సిపల్ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకున్న 7వ వార్డ్ అభ్యర్థి విజయ్ బుజ్జి



**నారాయణఖేడ్ మేజర్ న్యూస్**

నారాయణఖేడ్ నియోజకవర్గం మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా 7వ వార్డు లో బుధవారం ఓటును హక్కును వినియోగించూకున్న 7వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి విజయ్ బుజ్జి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థల ప్రతి ఓటు అమూల్యమైన సందేశాన్ని ఇస్తూ ప్రజలందరూ తప్పకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఏడవ వాడు అభ్యర్థి కౌన్సిలర్ అభ్యర్థి విజయ బుజ్జి పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు